# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 వసంతాల వార్త 1996 - 2026




## శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్ నజీర్

తిరుమల, జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. ఉదయం ఆయన ఆలయం వద్దకు చేరుకోగానే టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈఓ లోకనాథం, సివిఎస్ఓ మురళీకృష్ణ స్వాగతం పలికారు. శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు.

### నేడు తిరుపతిలో విజయోత్సవ సభను

# విజయవంతం చేయండి

### జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్..



తిరుపతి కలెక్టరేట్, జూన్ 11 ప్రభాతవార్త :

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం సాధించిన విజయాలు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరు, రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు జూన్ 12న తిరుపతిలో విజయోత్సవ సభను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మంత్రి, చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం తిరుపతి జిల్లా దామినేడు సమీపంలో జరగనున్న రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు మాట్లాడుతూ. రాష్ట్ర విభజన అనంతరం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్, గత ప్రభుత్వ పాలనలో అనేక రంగాల్లో వెనుకబడిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల అమలుతో పాటు ప్రమాణ స్వీకారం అనంతరం చేసిన కీలక నిర్ణయాలను ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేసిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని తెలిపారు. రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వం విజయవంతమైందని, దేశవ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్‌కు రావడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, భూముల హక్కులను రక్షించే చర్యలు, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని వివరించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "కంట్రీ ఫస్ట్" సిద్ధాంతంతో పనిచేస్తుండగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ "స్టేట్ ఫస్ట్" లక్ష్యంతో ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ రెండేళ్ల విజయాలను ప్రజలతో పంచుకునేందుకు నిర్వహిస్తున్న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని తెలిపారు.

## నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి తిరుపతి రాక

### జిల్లా కలెక్టర్



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి కలెక్టరేట్, జూన్ 11 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో నేడు తిరుపతికి విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా శుక్రవారం ఉ.10.40 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారన్నారు. అనంతరం ఉదయం11.00 గంటలకు తిరుపతి రూరల్ మండల పరిధిలోని దామినేడు గ్రామం వద్ద ఉన్న మహీంద్రా షో రూమ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్ డి ఏ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. కార్యక్రమం ముగించుకుని సభాస్థలి నుండి మధ్యాహ్నం 01.00 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 01.25 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళ్తారని కలెక్టర్ తెలిపారు.



# సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు మరింత జాప్యం

- 27 వేల క్వింటాళ్ళకు ప్రస్తుతం కేవలం 600 క్వింటాళ్ళ విత్తనాలు మాత్రమే రాక
- విత్తనాల పంపిణీకి మరో పది రోజులు పట్టే అవకాశం

చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:

జిల్లాలో సబ్సిడీ వేరుసెనగ విత్తనాల పంపిణీ మరింత జాప్యం కానుంది. జిల్లాకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు ఇప్పటికీ రాకపోవడంతో వ్యవసాయశాఖ రైతులకు విత్తనాలు పంపిణీ చేయడంలో ఆలస్యం చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి సూచనలు చేసినప్పటికీ జిల్లాలో ఎప్పటి నుండి సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేస్తారనే విషయంపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు. జిల్లాకు ఈ ఖరీఫ్ సీజన్‌లో 27,225 వేల క్వింటాళ్ల సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం విత్తనాలను కేటాయించింది. జిల్లాకు ఈ విత్తనాలు అనంతపురం, కడప జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుండి రావాల్సి వుంది. జిల్లాకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాల సరఫరా రెండు రోజుల క్రితం ప్రారంభమైనప్పటికీ ఈ రెండు రోజుల్లో కేవలం 600 క్వింటాళ్ళ వేరుసెగన విత్తనాలు మాత్రమే జిల్లాకు వచ్చి చేరాయి. జిల్లాకు మరో 26 వేల క్వింటాళ్ళకు పైగా విత్తనాలు రావాల్సి వుంది. జిల్లాకు పూర్తి స్థాయి వేరుసెనగ విత్తనాలు వచ్చిన అనంతరం వ్యవసాయశాఖ స్థానిక ప్రజా ప్రతినిధుల అనుమతులు తీసుకుని వారి ద్వారా రైతులకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను పంపిణీ చేస్తోంది. అంటే జిల్లాలో ఈ సీజన్‌లో జూన్ 20 నాటికి సబ్సిడీ వేరుసెనగ విత్తనాల పంపిణీ ప్రారంభం కానుందని తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్‌పై జిల్లా రైతాంగం అధికంగా ఆశలు పెట్టుకుంటారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా వేరుసెనగ పంటను వర్షాధారంతో రైతులు సాగు చేస్తారు. జిల్లాలో మే నెల మధ్య నుండి ఓ మోస్తరు వర్షాలు నమోదు కావడంతో వ్యవసాయశాఖ మే నెలాఖరు నాటికి సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను పంపిణీ చేస్తోందని రైతులు ఆశలు పెట్టుకున్నారు. మే నెలాఖరు నాటికి సైతం వ్యవసాయశాఖ వేరుసెనగ విత్తనాలను పంపిణీ చేయకపోవడంతో జూన్ మొదటి వారంలో నైనా విత్తనాల పంపిణీ జరుగుతుందని రైతులు భావించారు. అయితే జిల్లాకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు కేటాయించినప్పటికీ ఆ విత్తనాలు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

జిల్లాకు జూన్ 7వ తేదీ నుండి సబ్సిడీ వేరుసెనగ విత్తనాల సరఫరా ప్రారంభమైంది. ఈ రెండు రోజుల్లో కేవలం 600 క్వింటాళ్ళ వేరుసెనగ విత్తనాలు మాత్రమే జిల్లాకు సరఫరా అయ్యాయి. ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన విత్తనాల్లో కనీసం 60, 70 శాతం విత్తనాలు సరఫరా అయితే విత్తనాల పంపిణీ ప్రారంభించడానికి అవకాశం వుంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు జిల్లాలో జూన్ 20 నాటికి వేరుసెనగ విత్తనాల పంపిణీ జరిగే అవకాశం కన్పిస్తోంది.





తిరుమల తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన ఏ పి హై కోర్టు చీఫ్ జస్టిస్ లిసాగిల్‌కు గురువారం రాత్రి రేణిగుంట రైల్వే స్టేషన్‌లో సాదర స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు

# ఖరీఫ్ సీజన్లో అన్నదాతల వెతలు

## భూగర్భ జలాలు అడుగంటి ఎండుతున్న వరి నాట్లు

## ఏపీఐఎంఎస్ యాప్‌తో రైతులకు తప్పని తిప్పలు - తీవ్ర సంక్షోభంలో ఖరీఫ్ రైతులు



చిట్టమూరు, జూన్ 10, ప్రభాతవార్త

ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతన్నలు అష్ట కష్టాలు పడుతున్నారు. ఓవైపు వర్షాభావ పరిస్థితులు మరోవైపు అడుగంటిన భూగర్భ జలాలుతో అతలాకుతలమవుతున్న మండల రైతాంగం తీవ్ర సంక్షోభం దిశగా ముందుకు సాగుతున్నారు. గత నెల ముందుగానే ఈ దఫా ఎండలు తీవ్రతరం దాల్చే అవకాశం ఉందని ఎల్నీనో ప్రభావం అత్యధికంగా చూపుతుందన్న శాస్త్రవేత్తలు మాటలు రైతులు గుర్తించని నేపథ్యంలో అన్నదాతలు అన్ని విధాల తీవ్రంగా ఇబ్బందులు గురవుతున్నారు. చిట్టమూరు మండలంలో స్వర్ణముఖి నది పరివాహం ఒవక్క, మరోవైపు అడుగంటిన భూగర్భ జలాల్లో అందని నీటితో మరోవైపు రైతులు ఎదురీత ఎదుతున్నారు. గత డిసెంబర్ మాసం నుండి ఈనాటికి చిట్టమూరు మండలంలో చినుకు పడకపోవడంతో బోరు బావుల్లో నీరు అడుగంటి రోజువారి ఒక ఎకరం కూడా తడవని పరిస్థితి చిట్టమూరు మండలంలో దర్శనమిస్తుంది. ముఖ్యంగా చిట్టమూరు మండలంలో ఖరీఫ్ సీజన్లో గుణపాడు, గుణపాటి పాలెం, మెట్టు, పెళ్లకూరు, తిమ్మారెడ్డి వాగు, యాకసిరి, ఎల్లసిరి, అరవపాలెం, చిట్టమూరు, తాడుమేడు, ఆరూరు, ఈశ్వర్వక, తదితర ప్రాంతాలలో సుమారు 5000 ఎకరాల వరకు వరి పైరు సాగు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ దఫ్హా కాంప్లెక్స్ ఎరువుల రేట్లు గణనీయంగా పెంచడంతో పాటు నత్రజని ఎరువులను ఏపీఐఎంఎస్ పోర్టల్ ద్వారా రైతులకు విక్రయాలు జరపడంతో పలు సాంకేతిక సమస్యలు ఏర్పడడం ఒక్కో ఎకరానికి కనీసం రెండు బ్యాగులు కూడా యూరియా లభించకపోవడంతో రైతన్నలు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు జిల్లాల మినహా అందుబాటులోకి వచ్చిన యాప్ ద్వారా తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు అసలే వర్ష బావ ప్రతికూల పరిస్థితులు, మరోవైపు తెలుగు గంగ నీరు చిట్టమూరు మండలానికి విడుదల కాకపోవడం, ఉన్న బోర్లలో నీరు పంటకు అందకపోవడంతో రైతులు తీవ్రంగా కన్నీటి పర్వత అవుతున్నారు. ఎల్లసిరి రెవెన్యూ పరిధిలోని అద్దిపూడి, ఎల్లసిరి తదితర గ్రామాల్లో ఖరీఫ్ సీజన్లో వరి పంట చేసిన రైతులు తమ కళ్ళముందే పంటలు ఎండిపోతుండడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఏదేమైనా వరుణ దేవుడు కరుణిస్తే తప్ప ఖరీఫ్ సీజన్ సంక్షోభం నుంచి బయటపడే పరిస్థితులు లేవన్నది రైతన్నల వాదనగా ఉంది.

## బస్సును ఢీకొన్న కారు నలుగురుకి తీవ్ర గాయాలు

పలమనేరు, జూన్ 11, ప్రభాతవార్త:

కారులో తిరుమల దైవ దర్శనార్థం వెళుతూ ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటన ఆదివారం చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న 5 మంది తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి తమిళనాడు రాష్ట్రం హోసూరు నుండి తిరుమలకు వెళుతున్న కారు డ్రైవర్ మద్యం మత్తులో పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారులో వున్న మంజునాథ్, శరత్, ఆనంద్, రాజ్, మంజు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




# రూ.కోట్లలో డిపాజిట్లు గల్లంతు?

## టిటిడి గ్రాంటును వద్దనుకున్నారు!

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

వ్యాసాశ్రమానికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు కోట్లల్లో ఉంటాయనే అంచనా ఉంది. ఈ ఆశ్రమం దేవాదాయశాఖ నిబంధనలకు లోబడి నిధులు డ్రా చేయాల్సి ఉంటుంది. అయితే ఆశ్రమ కోశాధికారి తానే సర్వం అంటూ ఎండోమెంటు అనుమతి లేకుండా డ్రా చేసారనే ఆరోపణలున్నాయి. కోశాధికారిగా అమర్నాథ్ రెడ్డి వచ్చాక ఎంత డ్రా చేసారో ఎవ్వరికి తెలియదు. దాదాపు 40 నుండి 50 కోట్లు గల్లంతయినాయని ఆరోపణ. తీసుకున్న సొమ్ముకు ఓచర్లు ఇవ్వరు. దేనికి ఖర్చు చేసారో ఎవ్వరికీ తెలియదు. అంతా ఏకపక్షం, ఎవ్వరికీ లెక్కచెప్పాల్సిన అవసరంలేని స్థితి. శ్రీ వ్యాసాశ్రమానికిగల అకౌంట్లు ఎన్ని? అవి ఎవరి పేరుతో ఉన్నాయి? సందర్భానుసారంగా కొత్తగా ప్రారంభించినవి ఎన్ని? వాటినుండి గత 15 సం లుగా ఎంత డ్రా చేసినారు. ఎంత జమ చేసినారు. టి.టి.డి రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ లాంటి సంస్థలో బ్రహ్మవిద్య తదితరాలకు ఇచ్చే గ్రాంట్ను వద్దనుకున్నారు. దేనికని? తమ సంస్థ ఆర్థిక వివరాలు ఎవరికీ చెప్పే స్థితిలో లేనందువల్లేనా? అనే పలు సందేహాలు చోటు చేసుకున్నాయి శ్రీ వ్యాసాశ్రమ ద్వితీయ పీఠాధిపతి శ్రీ విద్యానంద స్వామివారి విగ్రహ ప్రతిష్ట పేర విరాళాలు సుమారు 75 లక్షలు సేకరించినారని. ఆశ్రమ సొమ్ముతో విగ్రహ ప్రతిష్ట చేసి విరాళాల సొమ్మును ప్రస్తుత పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద స్వామి తన సోదరుడు శివరాం బ్రహ్మాచారి మరియు అమర్నాథ్ రెడ్డిలు కుమ్మక్కై స్వాహా చేసినారనే ఆరోపణలు రాజ్యమేలుతున్నా నిర్వాహకులు స్పందించక పోవటంలో అంతర్యమేమిటని పలువురు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నెల్లూరు పట్టణంలోని గోవింద ఎడ్యుకేషనల్ సంస్థ వ్యవస్థాపకులు సుబ్బారెడ్డి సుమారు 20 కోట్లు విలువైన శ్రీ వేంకటేశ్వర విద్యాలయం పేరుతో స్కూలును ఏర్పేడు శ్రీ వ్యాసాశ్రమానికి బహుమతిగా ఇచ్చారు. ఆయన లక్ష్యాలను నెరవేర్చక పోగా, ట్రస్టు సొమ్ము రూ.40 లక్షలు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణ. అందులోని టీచర్లను, హెడ్ మాస్టర్లను ఈ తతంగం బయటపడుతుందని తొలగించినట్లు తీవ్ర విమర్శలున్నాయి. దీనిపై సమగ్ర విచారణ అవసరం. ఇప్పుడు వ్యాసాశ్రమంలో ఏ పిల్లలకు ఉచిత విద్య లేదు. అందరూ ఫీజులు కట్టవలసినదే. ఇది శ్రీ మలయాళ స్వాములవారి ఆశయాలకే విరుద్ధం. అందరూ ఫీజులు చెల్లిస్తున్నారు. ఈ ఫీజులు అన్ని అమర్నాథ్ రెడ్డి దగ్గరకే చేరుతున్నాయి వీటిని ఏమి చేస్తారో తెలియదు. ఏ లెక్కలలో చేరుస్తారో తెలియదు. పాఠశాలకు కార్పస్ ఫండ్ ఉంటుంది. ఈ ఫండ్ను కూడా డ్రా చేస్తునట్లు సమాచారం. 10, 15 సం లుగా నిర్వహిస్తున్న చతుర్మాస వ్రతాల సొమ్ము ఏ మౌతుంది?. కంటి హాస్పిటల్ కార్పస్ ఫండ్ లక్షలు కనుమరుగు. 2009లో సెప్టెంబరు నెలలో ఒకే సారి వ్యాసాశ్రమ అకౌంటు నుండి రూ.26 లక్షలు డ్రా చేసినట్లు సమాచారం.

(ఆశ్రమ ఆస్తుల అక్రమ అమ్మకాలపై రేపటి సంచికలో)



## రిజిస్టర్ కార్యాలయంలో ప్రేమ వివాహం

**పలమనేరు రూరల్, జూన్ 11 ప్రభాతవార్త:**

పలమనేర్ రూరల్ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన సతీష్(23) కర్నాటక రాష్ట్రం ముల్బాగులు చెందిన విద్య (19)లు, గురువారం కర్ణాటక రిజిస్టర్ కార్యాలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఒక సంవత్సరం నుంచి ఇరువురు ప్రేమించుకుని ఉండగా ఇరువురి పెద్దల అంగీకారంతోనే గురువారం కర్ణాటక రాష్ట్రం ముల్బాగల్ రిజిస్టర్ కార్యాలయంలో ఇద్దరికి ప్రేమ వివాహం జరిపించారు. ఇద్దరి కుటుంబాలు వీరి ప్రేమను అర్థం చేసుకొని వివాహం జరిపించారు.



## 14న మెగా రక్తదాన శిబిరం

**పలమనేరు, జూన్ 11, ప్రభాతవార్త:**

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న పలమనేరు పట్టణంలోని మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్, ఎన్‌హెచ్‌ఆర్‌సిసిఎఫ్ హెల్పింగ్ హ్యాండ్స్ వారి సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. రక్తదానం చేయు దాతలకు ఐఎంఎ అండ్ ఎన్‌హెచ్ ఆర్‌సిసిఎఫ్ తరపున సర్టిఫికేట్లుఅందజేస్తామని తెలిపారు. దాతలు 9491412008కు ఫోన్ చేసి పేరు వయస్సు, చిరునామా, మొబైల్‌నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ వైద్యులు మమతారాణి, డా.యుగంధర్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

## వీధి విక్రయదారులకు విరివిగా రుణాలు

**– మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్**

**చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:**



నగర పరిధిలోని వీధి విక్రయదారులకు బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న సిఎం స్వానిధి మహోత్సవంలో భాగంగా బ్యాంకుల పరిధిలో నిర్వహించాల్సిన లోక కళ్యాణ మేళా కార్యక్రమాలపై బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు, ఆర్‌ఎంలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన వీధి విక్రయదారులకు బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. మెప్మా పిడి నాగేశ్వరరావు మాట్లాడుతూ వీధి విక్రయదారులకు మొదటి దఫాలో 15 వేల రూపాయలు, 2వ దఫాలో 25 వేల రూపాయలు, 3వ దఫాలో 50 వేల రూపాయలు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా రుణాలు సక్రమంగా చెల్లించిన ఐదు మంది వీధి విక్రయదారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం హరీష్, సిఎంఎం గోపి, ఆర్‌ఎంలు, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ కట్టడికి టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1800 233 2447

**– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి**

**చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:**



క్షేత్ర స్థాయిలో లింగ నిర్ధారణను కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 1800 233 2447 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసిందని, ఈ హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకుని లింగ నిర్ధారణ పరీక్షలు జరుగకుండా కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆడ శిశువుల హక్కుల పరిరక్షణ, లింగ వివక్ష నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి వుందని, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి అమలులో వున్న ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నొస్టిక్ టెక్నిక్స్ చట్టం–1994ను పక్కాగా అమలు చేయడానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం అన్నారు. ప్రజల నుండి అభ్యర్థలను స్వీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 1800 233 2447ను అందుబాటులో వుంచిందన్నారు. గర్భంలోని శిశువు లింగంను నిర్ధారించడం, లింగ నిర్ధారణ సేవలను ప్రచారం చేయడం, లింగ ఎంపికకు ప్రోత్సహించడం వంటి చర్యలు చట్ట విరుద్ధమైనవని అలాంటి కర్యకలాపాలు సమాజంలో లింగ అసమానతలను పెంచడమే కాకుండా ఆడ శిశువుల జనన నిష్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలు, లింగ నిర్ధారణ సేవల ప్రకటనలు, అనుమతి లేని స్కానింగ్ లేదా డయాగ్నొస్టిక్ కేంద్రాలు లింగ ఎంపికను ప్రోత్సహించే ఏ విధమైన చర్యలు వున్నా సమాచారంను హెల్ప్‌లైన్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు. హెల్ప్‌లైన్ ద్వారా అందిన సమాచారం పూర్తిగా గోప్యంగా వుంచబడుతుందని, సంబంధిత అధికారులతో విచారణ నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆడ శిశువును రక్షించడం ప్రతి పౌరుని బాధ్యత అని, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, వైద్య నిపుణులు, ప్రజా ప్రతినిధులు, సాధారణ ప్రజలందరు కలిసి పిసిపిఎన్‌డిటి చట్టం పక్కాగా అమలుకు పూర్తి సహకారం అందించాలని డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## నేడు దివ్యాంగ పిల్లలకు సహాయక ఉపకరణాలు పంపిణీ

**– సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణ**

**చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:**

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమంను శుక్రవారం ఉదయం 10 గంటలకు చిత్తూరులోని మహాత్మా జ్యోతిరావు పూలే భవనంలో నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ఎడిఐపి పథకం కింద ఎఎల్ఐఎంసిఒ సంస్థ సహకారంతో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. అర్హులైన దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయక ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్ష ఛైర్మన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ హాజరు కానున్నారని తెలిపారు.

## టీచర్లకు టెట్ పరీక్షపై సమాచారం

**చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తు టెట్ పరీక్షకు హాజరు కావాల్సిన వారికి విద్యాశాఖ టెట్ పరీక్షకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది. ఎస్‌జిటి ఉపాధ్యాయులు టెట్ పేపర్ 1ఎ రాయాలి. స్కూల్ అసిస్టెంట్లు టెట్ పేపర్ 2ఎ పరీక్ష రాయాలి. ఎస్‌జిటిల్లో కొందరికి డిఇడి లేదా బిఇడి క్వాలిఫికేషన్ కలిగిన వారైనా పేపర్-1ఎ రాయాలి. పిఎస్‌హెచ్‌ఎంలుగా కంటిన్యూ కాదలచినవారు పేపర్ 1ఎ రాస్తే సరిపోతుంది. అలాగే స్కూల్ అసిస్టెంట్లుగా తిరిగి వెళ్ళదలచిన వారు పేపర్ 2ఎ రాయాలి. అలాగే ఎస్‌జిటి నుండి ప్రమోషన్ పొందిన స్కూల్ అసిస్టెంట్లు పేపర్ 2ఎ రాసిస్తే సరిపోతుంది. హైస్కూల్ హెడ్మాస్టర్లు, పిఇటి, పిడి, డ్రాయింగ్, ఆర్ట్స్ తదితరులు టెన్ పరీక్ష రాయనవసరం లేదు. 2025 డిఎస్సీ స్పోర్ట్స్ కోటాలో సర్వీస్‌లో చేరిన వారు కూడా టెట్ రాయనవసరం లేదు. అయితే భవిష్యత్తులో ప్రమోషన్ కోసం టెన్ రాయవలసి వుంటుంది. 31 ఆగస్టు 2030 నాటికి ఐదేళ్ళ సర్వీసులోపు వున్న వారు టెట్ పరీక్ష పాస్ కానవసరం లేదు. అలాగే ఐదు సంవత్సరాల సర్వీసులోపు వారు ప్రమోషన్ పొందాలంటే టెట్ తప్పనిసరి కాదు అని ఎస్‌సిఇఆర్‌టి వివరణ ఇచ్చింది. అలాగే థర్డ్ మెథడాలజీతో ప్రమోషన్ పొందిన వారు ప్రస్తుతం ఏ సబ్జెక్టులో పని చేస్తున్నారో దానికి సంబంధించిన పేపర్ 2ఎ పరీక్ష రాయాలి. ఎస్‌జిటిలు భవిష్యత్తులో ఏ సబ్జెక్టుకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్‌పై వెళ్ళదలిచారో ఆ సబ్జెక్టుకు సంబంధించిన పేపర్ 2ఎ పరీక్ష రాయాల్సి వుంటుంది. అలాగే సి-సెట్ లేక ఎపి-టెట్ ఏది పాస్ అయినా సరిపోతుంది.

## ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడానికి కృషి

**– రూ.1.49 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**



**గుడిపాల, జూన్ 11 ప్రభాతవార్త:**

గుడిపాల మండలంను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు రోడ్లు, లైట్లు, నీళ్ళు అందించాలనే లక్ష్యంతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. మండల పరిధిలోని పేయనపల్లి, మొగరాలపల్లి, చీలాపల్లి, బసవాపల్లి పంచాయతీల్లో బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు రూ.1.49 కోట్లతో నిర్మించిన సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడిపాల మండల పరిధిలోని ప్రజలకు మౌళిక సౌకర్యాలు కల్పించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల పరిధిలోని మారుమూల గ్రామాలకు తారు రోడ్లు, గ్రామాల్లోని వీధుల్లో సిమెంటు రోడ్ల సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని వ్యవసాయ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల పేయనపల్లి స్వర్ణ గ్రామ సచివాలయం వద్ద రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, ఎంపిడిఒ శిరీష, తహసిల్దారు శ్రీనివాసులు, ట్రస్ట్ ఛైర్మన్ చెన్నకేశవులునాయుడు, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్‌నాయుడు, ఎస్సీ సెల్ నాయకులు పీటర్, నాయకులు బాలాజీనాయుడు, అనిల్‌కుమార్, శరత్‌బాబు, ఎంపిటిసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, కూటమి పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.6 కోట్లతో నూతనంగా డ్రైనేజీల నిర్మాణం

**కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త**



సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మండలంలోని మల్లానూరు పంచాయతీలో ఆరు కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా డ్రైనేజీ కాలువలు నిర్మించనున్నారు. ఈ పనులకు సంబంధించి గురువారం నాయకులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమన్నారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతుల కల్పనకు సీఎం చర్యలు చేపట్టారన్నారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని మరింత ఆదరించాలని వారు కోరారు .కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, రెస్కో చైర్మన్ ప్రతాప్ ,టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్, జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర ,తెలుగు యువత అధ్యక్షుడు కనకరాజు ,స్థానిక నాయకులు చంద్రశేఖర్, దాము ,రమేష్, సంతోష్ ,వెంకటేష్ ,నాగ పాల్గొన్నారు .

## రాష్ట్రాన్ని అభివృద్ధి.. సంక్షేమం వైపు నడిపిస్తున్న సీఎం

**యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్**

**కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త**



ఐదేళ్ల వైసిపి పాలనలో అతలాకుతలమైన రాష్ట్రాన్ని అభివృద్ధి ,సంక్షేమం వైపు సీఎం చంద్రబాబు నాయుడు నడిపిస్తున్నారని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ ,ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు .జగన్ పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటేనే పారిశ్రామికవేత్తలు భయపడే వారన్నారు. అలాంటి పరిస్థితి నుంచి సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని కాపాడుతూ లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తున్నారు. రాష్ట్రానికి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ గా మారారన్నారు .మంత్రి నారా లోకేష్ సైతం తండ్రికి తగ్గ తనయుడిగా గూగుల్ లాంటి దిగ్గజ సంస్థను వైజాగ్ కు తీసుకువచ్చారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. శుక్రవారం తిరుపతిలో కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. కుప్పం నుంచి సైతం 60 కు పైబడి బస్సుల ద్వారా ప్రజలు తిరుపతి సభకు హాజరవుతారన్నారు. సమావేశంలో కడ సభ్యుడు రాజ్ కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్, రెస్కో చైర్మన్ ప్రతాప్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, మాజీ సర్పంచ్ గోపీనాథ్, నాయకులు మణి యాదవ్, వేలు, వల్లెప్ప తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాప్ నిర్వాహకుడు అరెస్ట్

**22 లీటర్ల మద్యం సీజ్**

**కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త**

మండలంలోని వానగుట్టపల్లి గ్రామంలో కిరాణా షాపులో అక్రమంగా మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కుప్పం అర్బన్ ఎస్ఐ బాబు తెలిపారు. గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తి కిరాణా షాపులో మద్యం బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడని గుర్తించామన్నారు .అతడి దుకాణం నుంచి 22 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసుకుని మురళిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తాం



**కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్**

**శాంతిపురం, జూన్ 11 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ పెర్కొన్నారు .గురువారం ఆయన శాంతిపురంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. శాంతిపురంలోని వ్యవసాయ శాఖ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన కడ ప్రాజెక్ట్ డైరెక్టర్, ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయ నిర్వహణకు అనుకూలంగా లేదని గుర్తించారు. అనంతరం వ్యవసాయ శాఖ కార్యకలాపాలు అంతరాయం లేకుండా కొనసాగేందుకు ప్రస్తుతం ఉన్న నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) భవనాన్ని వ్యవసాయ శాఖ వినియోగానికి కేటాయించాలని నిర్ణయించారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు మరియు ఇతర సామగ్రి నిల్వ చేసేందుకు ఆ భవనం అనుకూలంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అ లాగే నీటిపారుదల శాఖ కార్యాలయ నిర్వహణ కోసం శాంతిపురం ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న గదులను కేటాయించి అవసరమైన కార్యాలయ స్థలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు శాఖల కార్యకలాపాలు ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా కొనసాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం శాంతిపురం జంక్షన్ సమీపంలో కొత్త బస్సు షెల్టర్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రయాణికులు, విద్యార్థులు మరియు ప్రజలు వర్షం, ఎండ నుంచి రక్షణ పొందే విధంగా అనువైన ప్రదేశంలో బస్సు షెల్టర్ నిర్మించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ శాఖల సేవల మెరుగుదల మరియు ప్రజా సౌకర్యాల అభివృద్ధికి కడ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ పర్యటనలో ఆర్డీఓ షేక్ మహ్మద్ హుస్సేన్ ,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## యాదవ్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన సన్మానం

**శాంతిపురం, జూన్ 11 ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతిలో జరగబోయే కూటమి విజయోత్సవ సభకు జన సమీకరణ కోసం శాంతిపురం మండలం కు యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ వచ్చారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు నందిగం ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో నరసింహ యాదవ్ ని సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ నాగరాజు ,పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు , లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ భాష్యం విశ్వనాథ్ నాయుడు ప్యాక్స్ చైర్మన్ గోపాల్ , మాజీ క్లస్టర్ చంద్రశేఖర్ , శాంతిపురం మండలం ప్రధాన కార్యదర్శి మంజునాథ్ గౌడు , బి సి సెల్ అధ్యక్షులు ప్రసాద్ , ఎ ఎం సి డైరెక్టర్ శ్యామలమ్మ , యూనిట్ ఇన్చార్జిలు మణి , పెద్దన్న, గిరి , నారాయణస్వామి , కుప్పం నియోజకవర్గ ఐటిడీపీ జనరల్ సెక్రెటరీ శివ , సింగరి శ్రీనివాసులు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## సొంత ఇంటిని మరిపించేలా వసతి గృహాలు: ఎంపీడీఓ

**వి.కోట, జూన్ 11 ప్రభాతవార్త**



రాబోవు విద్యా సంవత్సరంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులకు సొంత ఇంటిని మరిపించేలా వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీ ఓ వెంకటేశ్వర్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు వి.కోట గ్రామపంచాయతీ,ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా మండల కేంద్రమైన వి.కోటలోని బీసీ బాలికల వసతిగృహంతో పాటు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని అన్ని గదులను దోమల లార్వా నివారణకు మలాథిన్ మందును గోడలకు స్ప్రే చేశారు.వీటితోపాటు హాస్టల్ ప్రాంగణాన్ని పరిశుభ్రపరిచి విద్యార్థుల కు అనుకూలంగా,అన్ని వసతులు కల్పించాలని వసతి గృహ నిర్వాహకులను ఆదేశించినట్లు వారు తెలిపారు.గ్రామపంచాయతీఈఓనరేష్,ఆరోగ్య సిబ్బంది హరి,వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.

## బైరెడ్డిపల్లిలో సర్ పై సమీక్షా సమావేశం.

**బైరెడ్డిపల్లి, జూన్ 11 ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ అధి నాయకత్వం ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లి సింగిల్ విండో కార్యాలయంలో గురువారం మండల టిడిపి అధ్యక్షులు బి.ఎం. రాధాకిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్య శెట్టి మాట్లాడుతూ, ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రతి బుధవారం పంచాయతీ స్థాయిలో సమావేశాలు నిర్వహించి గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆర్డీవో కార్యాలయం ఆధ్వర్యంలో జరగనున్న ఓటర్ జాబితా ధృవీకరణ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు తప్పనిసరిగా పాల్గొని క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించాలని సూచించారు. ఓటర్ జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బూత్ కన్వీనర్లు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌చార్జ్‌లు, పంచాయతీ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,**

## రిటైర్డ్ టీచర్ ఇంట్లో చోరీ



**1.5 కెజీల వెండి, నగదు అపహరణ**

**పలమనేరు, జూన్ 11, ప్రభాతవార్త:**

పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరులో రిటైర్డ్ టీచర్ గజేంద్ర ఇంట్లో చోరీ జరిగింది. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ముందు గేట్లు విరిచేసి, తలుపుల తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలు తెరచి బట్టలు ఇతర వస్తువులు చిందర వందర చేసి 1.5 కేజీల వెండి, కొంత నగదు, అపహరించుకు పోయారు. గజేంద్ర కుటుంబంతో బంధువుల ఊరికి వెళ్ళి ఉండగా ఈ చోరీ జరిగింది. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గృహస్తులు సమాచార మందించారు. జరిగిన చోరీపై గజేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వధ్యేయం

**– ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్**

**చిత్తూరురూరల్, జూన్ 11 ప్రభాతవార్త:**



పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. గురువారం చిత్తూరు నగరపాలక సంస్థ 13వ వార్డు మాపాక్షి ఎస్టీకాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటిపొజిషన్ సర్టిఫికేట్స్, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్, ఓటర్‌కార్డులు, రైస్‌కార్డులు, బర్త్ సర్టిఫికేట్స్ పంపిణీ చేసారు. కాలనీలో చాలామందికి గుర్తింపు, ఇతర పత్రాలు, ఇంటిపత్రాలు లేవని గతంలో తెలిపారని, అధికారులను సమన్వయం చేసి కాలనీలోని వవారికి అవసరమైన గుర్తింపు కార్డులు, ఇంటిపట్టాలు మంజూరు చేసి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన పేదలకు అందినప్పుడే ప్రభుత్వపనితీరు తెలుస్తుందన్నారు. తహశీల్దారు కులశేఖర్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఝాన్సీ, కూటమి నాయకులు ఈశ్వరరావు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రికి ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**చిత్తూరురూరల్, జూన్ 11 ప్రభాతవార్త:**




చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తన తండ్రి జిజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టరు గురజాల చెన్నకేశవులనాయుడుకు ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం బివి రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గృహంలో తండ్రికి తనయుడు గురజాల నితిన్‌తో కలసి ప్రేమపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు కూటని నాయకులు గురజాల చెన్నకేశవులుకు పూలమాల, దుశ్శాలువతో శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.13.36లక్షల సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**చిత్తూరురూరల్, జూన్ 11 ప్రభాతవార్త:**



ముఖ్యమంత్రి సహాయనిధి పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తూ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో నియోజకవర్గానికి సంబంధించి 11మంది లబ్ధిదారులకు రూ. 13.36లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసారు. కార్యక్రమంలో నియో జకవర్గ పరిశీలకులు పురిమిట్ల కుమారి, రాజేష్‌రెడ్డి, నరేష్, పచ్చయప్ప, ఉదయ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తారురోడ్డు వేశారు.. రోడ్డు రోలర్ మరిచారు

**రామకుప్పం, జూన్ 11 ప్రభాతవార్త**



రామకుప్పంలోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి బందార్లపల్లి మీదుగా తారు రోడ్డు వేశారు ... రోడ్డు రోలర్ మరిచారు. గత రెండు దశాబ్దాల క్రితం కాంట్రాక్టు తీసుకున్న వారు తారు రోడ్డు వేసి రోడ్డు రోలర్, మినీ టెంపో విడిచి మరిచారు. వైయస్సార్ సర్కిల్ నుంచి పందార్లపల్లికి పోవు రోడ్డులో వెయ్యి మీటర్లలో ఇక్కడ ఇంటి స్థలాలు కొనుగోలు చేసుకున్న యజమానులు జెసిబి ద్వారా ఇటుపక్క ఉన్న తుప్పు పట్టిన యంత్రాలను వేరే పక్కా స్థలాలకు మారుస్తూ రెండు దశాబ్దాలపైగా గడుస్తున్నది. ఇంటి స్థలాలు కొనుగోలు చేసి యజమానులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు రోలర్, మినీ టెంపోను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రాతి మండపం నిర్మాణానికి భూమి పూజ

**కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త**



కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి శిరస్సు తెర తొలగించే పాతపేట పెద్దబావి వద్ద నూతనంగా రాతి మండపం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. గురువారం రాతి మండపం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజ్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు ,రెస్కో చైర్మన్ ప్రతాప్ ,కమిటీ సభ్యులు జయరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కెఇసి వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్‌చే కంప్యూటర్ల వితరణ

**ఒకేషనల్ జూనియర్ కాలేజ్ లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం**



**కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త**

కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మరోమారు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఆయన మూడు లక్షల రూపాయల విలువచేసే పది కంప్యూటర్లను తన వంతు సహాయంగా అందజేశారు .ఈ సందర్భంగా కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్ విద్య ఎంతో కీలకమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజలో ఉండాలని ఆయన సూచించారు. అనంతరం దాత డాక్టర్ సునీల్ రాజ్ను ప్రిన్సిపల్, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు .కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతీశ్వరన్, లయన్స్ క్లబ్ సలహాదారు మహేష్ ,సభ్యులు సత్యేంద్ర శేఖర్, ప్రసాద్ ,సెల్వం, జయరాం నాయుడు, ఏకాంబరం, అధ్యాపకులు జగదీష్ బాబు, ప్రసాద్, శ్రీనివాసమూర్తి ,సిబ్బంది పాల్గొన్నారు .

## ఎంఎస్ఎంఈ పార్క్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలి

**ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్**

**కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త**



సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గుడిపల్లి మండలం పొగురుపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న ఎం ఎస్ ఎం ఈ పార్క్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ సూచించారు. గురువారం ఆయన నిర్మాణంలో ఉన్న పార్కును పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, కాంట్రాక్టర్లతో చర్చించారు త్వరలోనే సీఎం చంద్రబాబు నాయుడు ఎంఎస్ఎంఈ పార్కును సందర్శిస్తారని పేర్కొన్నారు .ఇక్కడ పలు పరిశ్రమలకు శంకుస్థాపన చేయడంతో పాటు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పరిశ్రమలను సీఎం ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు .కర్ణాటక నుంచి పొగురుపల్లి ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్క్ వద్దకు ఉన్న రోడ్డును కర్ణాటక ప్రభుత్వం అభివృద్ధి చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు

# సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు : ఎంపీపీ గూడూరు

బాలాయపల్లి, జూన్ 11 ప్రభాతవార్త: గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని భాస్కర్ రెడ్డి తెలిపారు. స్త్రీ శక్తి భవనంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. అన్ని శాఖల అధికారులతో జరుగుతున్న పనుల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెరిమిడి నుంచి వెంకటగిరికి బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకొని వెళ్ళమని అన్నారు. ప్రైవేట్ వాహనాలలో రావాలంటే ప్రజలకు 300 రూపాయలు దాకా ఖర్చు అవుతుందని, మేల్చూరు మీదుగా బాలాయపల్లికి రోడ్డు ఏర్పాటు చేయా లని కోరారు. జయంపు గ్రామంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ప్రభుత్వ ఆసుపత్రి మంజూరు చేయించినందుకు ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఒక కోటి 93 లక్షల రూపాయలతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. స్థల సేకరణ పూర్తయిందని, రిజిస్ట్రేషన్ అయితే నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ను త్వరగా చేపట్టాలని తహసిల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవ తీసుకొని పనులు పూర్తి చేయాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వెంకటగిరి నియోజకవర్గంలో రింగురోడ్డు, సిమెంట్ రోడ్లు అభివృద్ధి చేశారని అన్నారు. ఇప్పుడు వెంకటగిరిగూడూరు రోడ్డు, కామకూరు నిడిగల్లు సహా పలు రోడ్ల అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. బాలాయపల్లి పశువైద్యాధికారి కార్యాలయం కూలిపోయే దశలో ఉందని మండల పార్టీ అధ్యక్షులు రావి సత్యనాయుడు ఎంపీపీ దృష్టికి తీసుకుని వచ్చారు. జయంపులో పంట కాలువలు, డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయని, మరమ్మతులు చేయించాలని కోరారు. రైతులు పండ్లతోటల అభివృద్ధికి దరఖాస్తులు చేసుకోవాలని ఏపీవో జ్యోతి కోరారు. ఏపిఎం కిరణ్ మాట్లాడుతూ మండలంలో 720 గ్రూపులకు ఇప్పటివరకు విరివిగా రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ మండల పరిషత్ సమావేశంలో తహసిల్దార్ శ్రీనివాసులు ఎంపీడీవో నారాయణ, ఏపిఎం జ్యోతి, ఏపిఓవై కిరణ్, వైస్ ఎంపీపీలు వాన పార్వతి, బట్టేపాటి మురళీ మోహనరెడ్డి, ఎంపిటీసీలు ముంగర సుజాత, వేళ్ళ సురేంద్రరెడ్డి, డిటి శిరీష, మేట్రిన్ చెంచు రత్నమ్మ, వైద్యాధికారులు లియోనా, లిఖిత, ఇరిగేషన్ ఏఈలు జాహిద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి

## తాగునీటి సమస్య పరిష్కరించాలని గగ్గోలు పెట్టిన ప్రజాప్రతినిధులు

**- సత్వరమే పరిష్కరిస్తామన్న ఎంపీపీ తనుజారెడ్డి**



వెంకటగిరి, జూన్ 11 ప్రభాతవార్త: గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు గగ్గోలు పెట్టారు. తాగునీటి సమస్య ఉందని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తంబిరెడ్డి తనుజా రెడ్డి తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని మండల పరిషత్ ఉపాధ్యక్షులు సుధాకర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెడిన తాగునీటి బోర్లను బాగు చేయడం లేదని ఆందోళన చెందారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు పై ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెడిన తాగునీటి బోర్లను ఎందుకు బాగు చేయించడం లేదని మండిపడ్డారు. ఎస్టీ కాలనీలో అనేక బోర్లు చెడిపోయి ఉన్నాయని చెప్పారు. మెకానిక్ లేనందున చెడిన బోర్లను బాగు చేయించలేకున్నామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఎరువుల దుకాణ దారులు యూరియా ఇవ్వడం లేదని పలువురు సభ్యులు ఏవో సుజాత దృష్టికి తీసుకొని రాగా దుకాణదారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. యూరి యా ఇవ్వాలంటే ఇతర ఎరువులు కొనాలని షాపుల వారు ఇబ్బందులు పెడుతున్నట్లు సభ్యులు తెలిపారు. యూరియా సమస్య లేకుండా చేయాలని కోరారు. యూరియాను యాప్ ద్వారా కొనుగోలు చేయాలని ఏవో సూచించారు. ప్రభుత్వం కొత్తగా యాప్ను తీసుకొచ్చినట్లు చెప్పారు. యాప్ వినియోగం వల్ల ఎరువుల దుకాణం దారిలో సరుకును బ్లాక్లో అమలేరని తెలిపారు. అడవి భూముల్లో ఉపాధి పనులు చేయరాదని రేంజర్ బుజ్జి బాబు తెలిపారు. అటవీ భూముల్లో ఒకవేళ కాలువలు తవ్వాలనుకుంటే యంత్రాలు పెట్టకుండా మనుషుల ద్వారా చేయించాలని సూచించారు. అటవీ భూములు ఆక్రమించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. సభ్యులు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఏఎంసీ చైర్మన్ విశ్వనాథ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెంచలయ్య, సొసైటీ అధ్యక్షులు వెంకట ముని, ఎంఈఓ బాబయ్య, నీటిపారుదలశాఖ ఏఈ భూపతి బాబు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఎన్‌డిఏ సభ -తిరుపతిలో ట్రాఫిక్ మళ్ళింపు



తిరుపతి,జూన్ 11ప్రభాతవార్త: తిరుపతి రూరల్ శివార్లలోని దామినేడు వద్ద శుక్రవారం ఉదయం ఎన్డీఏ కూటమి ప్రభుత్వ బహిరంగ సభ జగరనుంది. ఇందుకోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , కేంద్ర మంత్రి వర్యులు ఇతర ప్రముఖులు విచ్చేస్తున్నందున ట్రాఫిక్ మళ్ళిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. రెండేళ్ళ నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో ప్రజల భద్రత, సౌకర్యం ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నారు. ప్రజలు, ప్రయాణికులు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. చిత్తూరు వైపు నుండి వచ్చే వాహనాలు ఒమేగా హాస్పిటల్ -చెర్లోపల్లి - జూపార్క్ - గరుడ సర్కిల్ - నంది సర్కిల్ -లీలామహల్ - కరకంబాడి మార్గం ద్వారా ప్రయాణించవలెను.

**మదనపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు :**

పీలేరు-రంగంపేట-శ్రీనివాస మంగాపురం-చెర్లోపల్లి-జూపార్క్-గరుడ సర్కిల్-నంది సర్కిల్ -ఫ్లైఓవర్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవలెను. ఆర్టీసీ బస్టాండ్ నుండి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు ఫ్లైఓవర్ -నంది సర్కిల్-గరుడ సర్కిల్ -జూపార్క్ -చెర్లోపల్లి -ఒమేగా హాస్పిటల్ మార్గం ద్వారా ప్రయాణించవలెను. కడప వైపు నుండి వచ్చే వాహనాలు. కట్టపుట్టాలమ్మ దేవాలయం- కరకంబాడి -మంగళం-లీలామహల్ మార్గం ద్వారా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవలెను. నెల్లూరు, నాయుడుపేట వైపు నుండి వచ్చే వాహనాలు వాజ్‌పేయి జంక్షన్ -ఓల్డ్ రేణిగుంట చెక్‌పోస్ట్ -రమణ విలాస్ సర్కిల్- కట్టపుట్టాలమ్మ దేవాలయం- కరకంబాడి- మంగళం- లీలామహల్-ఆర్టీసీ బస్టాండ్ మార్గం ద్వారా ప్రయాణించవలెను. చెన్నై, పుత్తూరు వైపు నుండి వచ్చే వాహనాలు గాజులమండ్యం సర్కిల్ -ఓల్డ్ రేణిగుంట చెక్‌పోస్ట్- నారాయణాద్రి హాస్పిటల్-బ్లిస్ సర్కిల్ మార్గం ద్వారా తిరుపతి నగరంలోకి ప్రవేశించవలెను. ట్రాఫిక్ నియంత్రణలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

## ఆలయంలో నరేంద్ర మోడీ పేరున పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 11 ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ ఇంచార్జీ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర దామోదర దాస్ మోడీ పేరున రుద్రాభిషేకం మరియు రాహుకేతు గురువారం పూజలను ఘనంగా నిర్వహించడం జరిగినది. దేశ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా దేశ ప్రధానమంత్రిగా పరిపాలించిన ఘనతను సాధించిన మోడీ నాయకత్వం వర్ధిల్లాలని ఆయాయురా రోగ్యాలతో పాటు మరెంత శక్తిని ప్రసాదించాలని రుద్రాభిషేకం, రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ 7 శతాబ్దాల నాటి నెహ్రూ పేరున ఉన్న 4,398 రోజుల పరిపాలన చరిత్రను జూన్ 10న అధిగమించి నేటితో 4,400 రోజులు పూర్తి చేసుకుని, అవినీతి రహిత ప్రధానిగా ఎక్కువ కాలం పని చేసిన ఎలక్టెడ్ పీఎంగా నరేంద్ర దామోదర దాస్ మోడీ నిలిచారని కోలా ఆనంద్ తెలిపారు. యావత్తు భారతావని దేశం కోసం, ధర్మం కోసం, దేశ అభివృద్ధి కోసం ఆయన బాటలో నడవాలని యువత ఆదర్శంగా పనిచేయాలని కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, మండల అధ్యక్షులు వేడం కృష్ణయ్య, బాగీతి వెంకటేష్, పార్టీ నాయకులు జీవి అమర్నాథ్, చాగణం శైలజా, రామ్ ఉమా సింగ్, పుణ్యం డిల్లీ కుమార్ రెడ్డి, మద్దు వాసు యాదవ్, కన్నా వెంకటేశ్వర్లు, దక్కిలి శివ, గోవర్ధన్, వెంకటగిరి హరి, తానికొండ్ల భరత్ నాయుడు, యశ్వంత్, సురేష్ , చెందు, రమేష్ నాయుడు, నాని, నైనారు శ్రీనివాసులు, వెంకటరాయులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదానంకు రూ.2 లక్షలు విరాళం





కాణిపాకం, జూన్ 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యఅన్నదాన పథకంకు ఇద్దరు భక్తులు వేరు వేరుగా లక్ష రూపాయలు వంతున రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఐరాల మండలం పుల్లూరుకు చెందిన ఎర్రక్క, గణేష్‌లు రూ.1,00,116, కర్నూలుకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి అనే భక్తుడు రూ.1,01,120 విరాళంగా అందజేశారు. ఈ మొత్తంను దాతలు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ సూపరిటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

**- రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే**



చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త: చిత్తూరు నగర పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులు గురువారం నగరపాలక సంస్థ, జాతీయ రహదారులు, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి నగర పరిధిలోని పలమనేరు రోడ్డు, కట్టమంచి రోడ్డు, సాంబయ్యకండ్రిగ రోడ్డులను పరిశీలించారు. దర్గా సర్కిల్ నుండి ఇరువారం బైపాస్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో వున్న విస్తరణ పనులను త్వరితంగా చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే దర్గా సర్కిల్ నుండి న్యూట్రిన్ ఫ్యాక్టరీ వరకు 80 అడుగులు, న్యూట్రిన్ ఫ్యాక్టరీ నుండి ఇరువారం బైపాస్ వరకు వంద అడుగుల మేరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. అలాగే మిగిలి వున్న భవన యాజమానులతో చర్చించి, వారిని ఒప్పించి అవసరమైన స్థలంను సేకరించాలన్నారు. ఎంఎస్ఆర్ సర్కిల్ నుండి మురకంబట్టు వరకు వున్న కట్టమంచి రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించడానికి నిధులు మంజూరైన నేపథ్యంలో పనులు త్వరితంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కట్టమంచి- సాంబయ్య కండ్రిగ రోడ్డు పనులను పరిశీలించి స్థానికంగా వున్న ఆలయంకు ప్రత్యామ్నా యంగా స్థలం చూపించి రోడ్డు విస్తరణకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఏసిపి నాగేంద్ర, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి వైద్యసేవ నిపుణులకు మెరుగైన వసతి

**-టిటిడి జెఈఓ డాక్టర్ శరత్**



తిరుమల,జూన్ 11ప్రభాతవార్తప్రతినిధి: తొలి విడత వైద్య నిపుణులు రానున్న నేపథ్యంలో వశిష్ఠ అతిథి గృహం, ఆయుర్వేద కళాశాల అతిథి గృహం, స్విమ్స్ అతిథి గృహాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని టిటిడి జెఈఓ డాక్టర్ శరత్ సూచించారు.టిటిడి ఆధ్వర్యంలోని అన్ని ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించేందుకు వస్తున్న శ్రీవారివైద్యసేవ నిపుణులకు చక్కటి వసతి కల్పించాలని ఆదేశాలిచ్చారు.

## నేడే కూటమి బహిరంగ సభ



తిరుపతి,జూన్ 11ప్రభాతవార్త: రెండు సంవత్సరాల సంకల్పం, అభివృద్ధి, సంక్షేమం సభ ఏర్పాట్లను కూటమి నాయకులతో కలిసి తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి గురువారం పరిశీలించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈబహిరంగ సభ ఏర్పాట్లను తిరుపతి పార్లమెంట్ కో ఆర్డినేటర్ దామచర్ల సత్య, పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, కూటమి నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ సంఖ్యలో తరలిరానున్న ప్రజలకు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులుకలగకుండా గ్యాలరీలు, జర్మన్‌షెడ్లు, పటిష్టమైన వేదిక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఎన్‌డిఏ బహిరంగ సభలో పాల్గొననున్న ఉపముఖ్యమంత్రి

**జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్..**

తిరుపతి కలెక్టరేట్, జూన్ 11 ప్రభాతవార్త: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లాలో ఒక రోజు పర్యటించనున్న నేపథ్యంలో జూన్ 12న తిరుపతికి విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా శుక్రవారం ఉ.10.30 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారన్నారు. అనంతరం ఉ.10.50 గం.లకు తిరుపతి రూరల్ మండల పరిధిలో గల దామినేడు సమీపంలో ఏర్పాటు చేసిన రీజినల్ స్థాయి ఎన్ డి ఏ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం 01.15 గం.లకు తాజ్ హోటల్ చేరుకుని విశ్రాంతి తీసుకుంటారన్నారు. అనంతరం మ.3.00 గం.లకు తాజ్ హోటల్ నుండి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని మ.3.30 గం.లకు విజయవాడ బయల్దేరి వెళతారని కలెక్టర్ తెలిపారు.

## కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

తిరుపతి,జూన్ 11ప్రభాతవార్త: తిరుపతి రూరల్ దామినేడు సభా స్థలి వద్ద సుమారు 2వేలమంది పోలీసు అధికారులు, సిబ్బందితో పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సభా స్థలి, వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీ మార్గాలు, ప్రజల ప్రవేశ-నిష్క్రమణ మార్గాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాల పర్యవేక్షణ. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణ, అత్యవసర సేవలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసకుంటున్నారు.. పభకు ముఖ్యమంత్రి ,డిసిఎం హాజరుకానున్న నేపథ్యంలో దామినేడు సభా స్థలి వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు క్షుణ్ణంగా పరిశీలించారు. మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు,ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి, టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ,ఇతర ఉన్నతాధికారులతో కలిసి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు.కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రతినిధులు, ప్రజలు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని సుమారు 2వేల మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సభా ప్రాంగణం, ప్రజా గ్యాలరీలు, వీఐపీ గ్రీన్ రూములు, వేదిక పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, వీఐపీ మార్గాలు మరియు ప్రజల రాకపోకలకు సంబంధించిన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించే విధంగా ప్రత్యేక బృందాలను నియమించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## దరఖాస్తులో తాగునీటి పునరుద్ధరణ

**- ఎంపీడీవో, పిడబ్ల్యుఓ చొరవతో మోటార్ పైపులైన్లకు మర్మమతు**



చిట్టమూరు, జూన్ 11 ప్రభాతవార్త: చిట్టమూరు మండల పరిధిలోని దరఖాస్తు గ్రామంలో త్రాగునీటి మోటారు మరమ్మతులకు గురై వారం రోజులు కావస్తున్న ప్రత్యేక అధికారి పట్టించుకోక పోవడంపై సోషల్ మీడియా కథనాలు పట్ల మండల అభివృద్ధి అధికారి స్పందించారు. గ్రామానికి చెందిన ప్రజలు తాగునీరు, వ్యక్తిగత అవసరాల కోసం అష్ట కష్టాలు పడుతున్న నేపథ్యంలో సమాచారం అందుకున్న పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ గురవయ్య ఎంపీడీవో ఉమామహేశ్వరావు కాలం చెల్లిన మోటార్కు మరమ్మతులు చేయడంతో పాటు ట్యాంకు వెళ్లే పైపులైను సరి చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

**-అటకెక్కిన సిపిడబ్ల్యూ పథకం**

దరఖాస్తు గ్రామానికి తాగునీరు నిమిత్తం సిపిడబ్ల్యూ పథకం, అది కాగితాలకి, కాంట్రాక్టర్ల జేబులు నింపుకునే దానికి తప్ప క్షేత్రస్థాయిలో ఈ పథకంలో నీరు గ్రామానికి చేరడం లేదు. గత 20 సంవత్సరాలు కాలంగా వాకాడు స్వర్ణముఖి పరివాహ ప్రాంతంలోని వేముగుంటపాలెం గ్రామంలో ఫిల్టర్ పాయింట్లు వేసి పైప్లైన్ల ద్వారా అరవపాలెం పంచాయతీలోని చిన్న దరఖాస్తు,పెద్ద దరఖాస్తు గ్రామాలకు త్రాగునీరు అందించు నిమిత్తం సిపిడబ్ల్యూ స్కీం ప్రారంభించారు. ఈ స్కీం నిర్వహణకు ప్రతినెల లక్షల రూపాయలు విడుదలవుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో చూస్తే సరఫరా అంతంత మాత్రంగానే జరుగుతుందన్నది. ఈ స్కీం నిర్వహణలో కాంట్రాక్టర్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కుమ్మక్కై నిధులు కాజేస్తున్నారు తప్ప సరఫరా అన్నది జరగడం లేదన్నది ప్రజలు వాదనగా ఉంది.

## ట్రాన్స్ జెండర్‌ల సమస్యలపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, జూన్ 11 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ట్రాన్స్ జెండర్‌ల సమస్యలపై ప్రభుత్వం సానుభూతితో ప్రత్యేకంగా దృష్టి సారించిందని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ట్రాన్స్ జెండర్‌ల ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీట్రాన్స్ జెండర్ లతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ట్రాన్స్జెంటర్లకు చేరే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారికి టిడ్కో గృహాలలో ఒక్క బ్లాక్‌ను కేటాయించే అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. అనంతరం సూళ్లూరుపేట పట్టణంలోని ట్రాన్స్ జెండర్లు తమ సమస్యలపై వినతి పత్రాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష, తెలుగుదేశం పార్టీ రూరల్ అధ్యక్షుడుపాకం వెంకటసుబ్బయ్య, దొరవారి సత్రం మండల పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, తహసీల్దార్ శైల కుమారి, మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 494 నేత్రదానం



సూళ్లూరుపేట, జూన్ 11 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవా సంస్థకు గురువారం 494వ నేత్రదానం అందింది. పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డులో నివాసం ఉంటున్న పొట్లంపూడి నాగభూషణం (74) మృతి చెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాల నుండి కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



వెంకటగిరి, జూన్ 11 ప్రభాతవార్త: రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బి.ప్రతాప్ తెలిపారు. మండలంలోని బోరెడుగుంట గ్రామం నందు కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి అధ్యక్షతన కేతి బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధికంగా రసాయన ఎరువులు వాడడం వలన నేల ఆరోగ్యం, సమతుల్యత దెబ్బతిని పంటల దిగుబడి తగ్గుతుంది అని తెలియచేసారు. శాస్త్రవేత్త రాజీవన మాట్లాడుతూ రైతులు జీవన ఎరువులు వినియోగించాలని తద్వారా రసాయన ఎరువుల మోతాదు తగ్గించుకోవచ్చు అని తెలియచేసారు. రైతులు పచ్చి రొట్ట ఎరువులు సాగు ద్వారా మనం నేల సారాన్ని పెంచవచ్చు అని, రైతులు భుసారా పరీక్ష ఆదారిత ఎరువుల యాజమాన్యం చేయాలనీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్ష విధానం పట్ల పంప్లెట్ పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో టీవీఎస్ సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విజయోత్సవ సభను విజయవంతం చేయాలి: వాడపల్లి



తొట్టంబేడు,జూన్ 11 ప్రభాతవార్త: ఎన్‌డిఏ ప్రభుత్వం రెండేళ్ళ పాలనపై శుక్రవారం తిరుపతిలో నిర్వహించే విజయోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మార్కెటింగ్ చైర్మెన్ వాడపల్లి జయచంద్రనాయుడు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయినా సందర్భంగా నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు తెలుగుదేశం కూటమి సభ్యులు ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు స్పందించాలని జయచంద్రనాయుడు కోరారు. ఈ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌లు ముఖ్యఅతిధులుగా హాజరయ్యే సభను విజయవంతం చేసి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఆయన పిలుపు నిచ్చారు.

## హుండీల ఆదాయం రూ.4.14లక్షలు



ఏర్పేడు,జూన్ 11 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఆలయం కుంబాభిషేకం సందర్భంగా చాలా రోజులు భక్తులు రాలేదు. తరువాత భక్తులతో పాటు విఐపిల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇక్కడి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా హుండీల ద్వారా రూ.3,94,964 లు, అలాగే నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.20,019 లు వచ్చినట్లు ఆలయాధికారి మునిశేఖర్ తెలిపారు. వెలరసి రూ.4,14లక్షలు వచ్చినట్లు ఇఒ వివరించారు. హుండీల లెక్కింపుల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరినాయుడు,వారి సహాచరులు,ఆలయ సిబ్బంది అర్చకులు, వేదపండితులు హాజరయ్యారు.

## మామిడి గుజ్జు పరిశ్రమను పరిశీలించిన జెసి



తవణంపల్లి, జూన్ 11 ప్రభాతవార్త: మండలంలోని తవణంపల్లి గ్రామ సమీపంలోని మామిడి గుజ్జు పరిశ్రమను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా ఉద్యానశాఖ అధికారులకు కలిసి గురువారం పరిశీలించారు. ఈ మేరకు తవణంపల్లి మండలం మిట్టపల్లి గ్రామ సమీపంలోని ఫీల్ ఫ్రెష్ ఫుడ్ మామిడి గుజ్జు పరిశ్రమను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి రోజు ఫ్యాక్టరీకి ఎన్ని టన్నుల మామిడి కాయలు సరఫరా అవుతున్నది! అనే విషయంను అక్కడ వున్న రైతులను జెసి అడిగి తెలుసుకున్నారు. అలాగే ట్రాక్టర్లలో మామిడి కాయలు వెయిటింగ్ లేకుండా చూసుకోవాలని, ఏ రోజు ధర ఆ రోజు ఫ్యాక్టరీ వద్ద డిస్ప్లే చేయాలని, సరైన ధరకే రైతుల వద్ద నుండి మామిడి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జి.సతీష్, ఉద్యాన సహాయ సంచాలకులు కోటేశ్వరరావు, స్థానిక తహసిల్దారు మాధవరాజు, బంగారుపాళ్యం ఉద్యాన అధికారి సాగరిక తదితరులు పాల్గొన్నారు.

# నేడు తెరుచుకోనున్న పాఠశాలలు

**వేసవి విరామానికి ముగింపు.. నేటి నుంచి బడిబాట**
**విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం.. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ**
**కొత్త ఆశయాలతో విద్యా సంవత్సరానికి శ్రీకారం..**
**విద్యార్థుల చేరికలు, నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి**





**తిరుపతి విద్య, జూన్ 11 ప్రభాతవార్త**

వేసవి సెలవులు ముగియడంతో 2026-27 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు నేటి నుంచి పునఃప్రారంభమవుతున్నాయి. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉన్నత లక్ష్యాలను సాధించేలా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తిరుపతి జిల్లా విద్యాశాఖ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. విద్యార్థుల చేరికల పెంపు, డ్రాప్‌ఔట్‌ల పునఃచేరిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పాఠ్యపుస్తకాల పంపిణీ, విద్యార్థుల భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో మొత్తం 2,363 పాఠశాలలు, 1,39,725 మంది విద్యార్థులు, 8,764 మంది ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థలో భాగస్వాములై ఉన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

గత విద్యా సంవత్సరంలో జిల్లాలో 7,149 మంది విద్యార్థులు డ్రాప్‌ఔట్‌లుగా గుర్తించబడగా, ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ఆ సంఖ్య 1,869కు తగ్గింది. మిగిలిన విద్యార్థులను కూడా ఈ నెలాఖరులోపు తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తూ విద్య ప్రాధాన్యతను వివరించడం ద్వారా విద్యార్థుల పునఃచేరికకు కృషి చేస్తున్నారు.

**పాఠ్యపుస్తకాల పంపిణీలో వేగం**

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే జిల్లాకు 7,47,143 పాఠ్యపుస్తకాలు కేటాయించగా, అందులో 7,36,347 పుస్తకాలను మండల కేంద్రాలకు పంపిణీ చేసి, అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేశారు. మిగిలిన పుస్తకాలు రాష్ట్ర స్థాయి నుంచి అందిన వెంటనే పంపిణీ పూర్తి చేయనున్నారు. అలాగే విద్యార్థులకు సరిపడినంత నోట్‌బుక్స్ కూడా అందించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులకు యూనిఫాంలు, విద్యా కిట్లు తదితర అవసరమైన సామగ్రి రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాకు అందిన వెంటనే తక్షణమే అందించేందుకు చర్యలు చేపట్టడమయినది. పాఠశాల ప్రారంభం నుంచే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాలోని పాఠశాలల్లో 1,38,364 మంది విద్యార్థులు నమోదుకాగా, ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే 1,39,725 మంది విద్యార్థులు నమోదు అయ్యారు. జిల్లా విద్యా శాఖ చేపట్టిన "బడి పిలుస్తోంది" కార్యక్రమం ఈ పెరుగుదలకు ప్రధాన కారణమైంది. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**అడ్మిషన్లలో రికార్డు స్థాయి వృద్ధి**

జిల్లాలో ఒకటో తరగతి ప్రవేశాల కోసం 13,502 మంది విద్యార్థుల లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటికే 11,434 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. దీంతో నిర్దేశిత లక్ష్యంలో 86 శాతం నమోదు వేసవి సెలవుల కాలంలోనే పూర్తైంది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి లక్ష్యాన్ని పూర్తిగా అధిగమించి, మరింత అధిక సంఖ్యలో అడ్మిషన్లు నమోదయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇదిజిల్లాలోప్రభుత్వవిద్యపై తల్లిదండ్రుల విశ్వాసం పెరుగుతున్నదానికి నిదర్శనంగా నిలుస్తోంది.

పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లో స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్ ను సమర్థవంతంగా అమలు చేశారు. తరగతి గదులు, మరుగు దొడ్లు, తాగునీటి సౌకర్యాలు, వంటశాలలు, పాఠశాల ఆవరణలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచారు. కలుపు మొక్కలు, చెత్త, పనికిరాని సామగ్రి, దెబ్బతిన్న ఫర్నిచర్‌ను తొలగించారు. తరగతి గదుల్లో బెంచీలు, బ్లాక్‌బోర్డులు, అల్మారాలను శుభ్రపర చడంతో పాటు నూతన విద్యా ప్రదర్శన సామగ్రిని ఏర్పాటు చేశారు. కంప్యూటర్లు, ప్రింటర్లు, సాంకేతిక పరికరాలు, విద్యుత్ సౌకర్యాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, క్రీడా సామగ్రిని వినియోగానికి సిద్ధం చేశారు. విద్యార్థుల భద్రత కోసం స్కూల్ సేఫ్టీ ప్లాన్‌లు, అత్యవసర తరలింపు ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**మన బడి – మన పండుగ**

పాఠశాలల ప్రారంభాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ పిలుపునిచ్చారు. పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించి, విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలకాలని సూచించారు. ప్రత్యేకంగా ఒకటో తరగతి, ఆరవ తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులను వారి తల్లిదండ్రులతో కలిసి ఆహ్వానించి, చాక్లెట్లు పంపిణీ చేస్తూ ఆనందోత్సాహాల మధ్య

## మంగంపేటలో ఓ ప్రముఖ నాయకుడు మిల్లులపై...ఏడి ఎంజి అధికారులు దాడులు?

**ఓబులవారిపల్లి 11 జూన్ ప్రభాతవార్త**

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం లోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట ఏపీఎండిసి పరిధిలో ఉన్నటువంటి ఒక ప్రముఖ నాయకుడు ముగ్గురాయి మిల్లులపై. ఏ డి ఎం జి అధికారులు దాడులు నిర్వహిస్తున్నట్లు విశ్వసినీ సమాచారం. విజయవాడలోని ఏడిఎంజి కార్యాలయంలో ఉన్న ఏడి మిల్లులపై ఎంక్వయిరీ కి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది 2016 సంవత్సరంలో ఓఎన్జిసి రాయల్టీ ముగ్గురాయి సరఫరాపై పరిశీలనలు



కొద్దిరోజుల్లో జరుగుతాయని సమాచారం విజయవాడ హెడ్ ఆఫీస్ లో సిఎన్డి సప్లై ఓఎన్జేసీ. సంస్థకు అందించే ముగ్గురే సరఫరా లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై, దాదాపు 10 మిల్లులు యజమానులు సిఎండి ముగ్గురాయిని నాసిరకం పౌడర్ ను సప్లై చేశారని ఆరోపణలపై విజిలెన్స్ ఎంక్వైరీ కూడా చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం పలు ఉన్నతాధికారులు మిల్లులపై ఎంక్వయిరీలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది ఎంక్వైరీలో నిజానిజాలు తెలియాల్సి ఉందని మంగంపేటవాసులు చర్చించుకుంటున్నారు

## నడవలేని కాళ్ళకు మళ్ళీ ప్రాణం

**– చిత్తూరు అపోలో ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సలు**

**చిత్తూరు, జూన్ 11 ప్రభాతవార్త:**



నడవలేని స్థితిలో వున్న ఇద్దరు నిరుపేదలకు చిత్తూరు ప్రభుత్వ అపోలో ఆసుపత్రి వైద్యులు మోకాళ్ళ మార్పిడి చికిత్స విజయవంతంగా నిర్వహించి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. లక్షల రూపాయలు ఖర్చు అయ్యే ఈ క్లిష్టమైన ఆపరేషన్లను ప్రభుత్వ అపోలో ఆసుపత్రిలో వైద్యులు ఉచితంగా నిర్వహించి నడవలేని స్థితిలో వున్న కాళ్ళకు మళ్ళీ ప్రాణం పోసి వారు నడిచే అవకాశంను కల్పించారు. యాదమరి మండలం చిన్నంపల్లి గ్రామంకు చెందిన ఎం.చల్లయ్య(76) తీవ్ర మోకాళ్ళ నొప్పితో చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ మేరకు చికిత్స కోసం చిత్తూరు అపోలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఎం.చల్లయ్య వైద్యాధికారులను సంప్రదించాడు. ఈ మేరకు వైద్యాధికారులు చల్లయ్యను పూర్తి పరీక్షలు నిర్వహించి అతనికి మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆపరేషన్ జరిగిన మరుసటి రోజు నుండి చల్లయ్య నెమ్మదిగా నడవడం ప్రారంభించాడు. అనంతరం ఫిజియోథెరపీ నిపుణుల పర్యవేక్షణలో చల్లయ్య కోలుకుని ఆనందంగా ఇంటికి వెళ్ళాడు. అలాగే పాకాల మండలం పెద్దరామాపురం గ్రామంకు చెందిన పి.సునీత(47) చాలా కాలంగా తీవ్రమైన మోకాళ్ళ నొప్పితో బాధపడుతోంది. ఈమె తిరుపతి, బెంగళూరుల్లోని పలు ఆసుపత్రులకు వైద్యం కోసం తిరిగి వైద్యం చేయించుకుంది. అయితే మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సకు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని చెప్పడంతో తన ఆర్థిక పరిస్థితి గుర్తుకు రావడంతో శస్త్రచికిత్స చేయించుకోకుండా మిన్నకుండిపోయింది. ఈ పరిస్థితుల్లో చిత్తూరు ప్రభుత్వ అపోలో ఆసుపత్రిలో వైద్యులను సునీత సంప్రదించడంతో ఆమెకు వైద్యాధికారులు ఉచితంగా మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఆరోగ్యం కోలుకున్న సునీత సంతోషంతో ఇంటికి వెళ్తున్నది. చిత్తూరు ప్రభుత్వ అపోలో ఆసుపత్రిలో ఈ శస్త్రచికిత్సలను అర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ హరిబాబు, డాక్టర్ అశోక్, డాక్టర్ ఆశిష్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ మోగలీష్, డాక్టర్ అఖిల్ బృందంతో పాటు అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ రాధా నేతృత్వంలోని బృందం సమన్వయంతో శస్త్రచికిత్సలను విజవంతంగా నిర్వహించి పూర్తి చేశారు. లక్షల రూపాయల వ్యయంతో జరిగే ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించడం పట్ల రోగుల కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అపోలో ప్రధాన ఆసుపత్రిలో అందిస్తున్న నాణ్యమైన వైద్యసేవలు పేద ప్రజలకు గొప్ప వరంగా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిడెండెంట్ డాక్టర్ రంగనాథ్ బిజి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడంలో ఇలాంటి విజయవంతమైన శస్త్రచికిత్సలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, అత్యాధునికవైద్యసేవలనునిరుపేదలకుఅందుబాటులోకితీసుకురావడమేతమ లక్ష్యమని పేర్కొన్నారు.

## బస్సులో బ్యాగ్ మరచిపోయిన మహిళ

**గంటలోపే బ్యాగ్ అప్పగించిన పోలీసులు**



**కుప్పం, జూన్ 11 ప్రభాతవార్త**

ఓ మహిళ బస్‌లో బ్యాగ్ మరచిపోగా గంటలోపే బ్యాగ్‌ను కనుక్కొని గుడుపల్లె ఎస్ ఐ శ్రీకాంత్ అప్పగించారు. గురువారం సాయంత్రం సుమారు 6:30 గంటలకు బైరెడ్డిపల్లి కి చెందిన వనజాక్షి ( 36) తన యొక్క హ్యాండ్ బ్యాగ్ పి ఇ ఎస్ మెడికల్ కాలేజ్ నుండి కుప్పం వైపు బస్సులో వస్తుండగా బ్యాగ్ఎక్కడో మిస్ అయింది అని డయల్ 112 కాల్ చెయ్యగా వెంటనే గుడిపల్లి ఎస్ ఐమరియు శ్రీకాంత్ సంఘటన స్థలంకు వెళ్ళి సిసి పుటేజ్ ద్వారా ఆమె యొక్క బ్యాగును కనిపెట్టి గంటలోపే ఆమెకు అప్పగించడమైనది. వనజాక్షి ఎస్ఐకు కృతజ్ఞతలు చెప్పారు.

## తొండనాడు కథలపై పరిశోధనకు డాక్టరేట్



**పాకాల, జూన్ 11, ప్రభాతవార్త:**

పాకాల మండలం దామలచెరువు గ్రామానికి చెందిన పరిశోధకుడు పాలెం సైదలికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో ప్రొఫెసర్ పేట శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో తొండనాడు కథలు – పరిశీలన (సంకలనానికి పరిమితం) అనే అంశంపై పరిశోధన నిర్వహించి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు ఈ డాక్టరేట్ లభించింది. విశ్వవిద్యాలయం ఛాన్సలర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ మరియు వైస్ ఛాన్సలర్ ఆచార్య టాటా నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన పట్టాభిషేకోత్సవ కార్యక్రమంలో సైదలి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. పరిశోధన కాలంలో సైదలి మౌలానా అజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను పొందారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యయన శాఖ ఆచార్యులు, పరిశోధక మిత్రులు, దామలచెరువు గ్రామ పెద్దలు, బంధువులు మరియు శ్రేయోభిలాషులు పాలెం సైదలికి అభినందనలు తెలియజేశారు.

## రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్

**విజయపురం, జూన్ 11 ప్రభాతవార్త:**



విజయపురం మండలం మహారాజపురం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం పరిశీలించారు. సర్వే పనుల పురోగతి, భూ రికార్డుల నమోదు విధానం, క్షేత్ర స్థాయి అమలును ఆయన పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం గ్రామ రైతులతో నేరుగా మాట్లాడి రీ సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భూ హద్దులు, రికార్డుల నమోదు, ఇతర సమస్యలపై రైతులు తెలిపిన అంశాలను శ్రద్ధగా విని పారదర్శకంగా, తప్పులకు తావులేకుండా సర్వే ప్రక్రియ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండాసమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు మండల తహసీల్దార్ మునిశైలజ, రీ సర్వేడీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, ఎంఆర్ఐ తేజస్విని, వీఆర్‌వోలు చరణ్‌కుమార్, వెంకటేశులు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## గంజాయి వాడకం యువతకు ప్రమాదం

**సత్యవేడు, జూన్ 11 ప్రభాతవార్త:**



గంజాయి వాడకం యువ తకు ప్రమా ద కరమని ఎస్ఐ సాయినాథ్‌చౌదరి పేర్కొన్నారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం గురువారం సత్యవేడు పంచాయతీ కొంమిట ీగుంటలో ఎస్ఐ సాయినాథ్‌చౌదరి ఆధ్వర్యం లో గంజాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులను ఉద్దేశించి ఎస్ఐ మాట్లాడుతూ యువత గంజాయి వాడకానికి బానిసలుగా మారి అనేకనేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా ఆ మత్తులో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. తల్లిదండ్రులు, పిల్లలు నడవడికపై దృష్టి పెట్టి చేసే మార్గాలకు, సులభంగా డబ్బులు సంపాదించే ఆలోచనలు దూరంగా ఉంచాలన్నారు. గంజాయిని వాడ్కున్న వాటిని సరఫరా చేసేవాళ్లు ఎక్కువయ్యారని అలాంటివాళ్ళని వదిలిపెట్టి సమస్యే లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తు న్నారన్నారు. గంజాయి బారిన పడకుండా యువత ఆరోగ్యంగా ఉండాలని ఆయన సూచించారు.

## మామిడి రైతుల సమస్యను రాజకీయం చేయకండి

**– మామిడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎకె హరిబాబు చౌదరి**



**తిరుపతి హెల్త్, జూన్ 11, ప్రభాతవార్త**

మామిడి రైతుల సమస్యను రాజకీయం చేయకం డని మామిడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎకె హరిబాబు చౌదరి పేర్కొన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి రైతుల ప్రస్తుత సంక్షోభాన్ని కొన్ని రాజకీయ పార్టీలు సృష్టిస్తున్నాయని సూచించే ఇటీవల చేసిన వ్యాఖ్యలపై రైతు సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. ఇది రాజకీయ సమస్య కాదని, వేలాది మామిడి రైతుల జీవనోపాధికి సంబంధించిన రైతుల సమస్య అని తెలిపారు. రైతులను, మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమను రక్షించేందుకు అవసరమైన విధానపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం మరియు ఉద్యాన శాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. దురదృష్టవశాత్తూ, రైతు కేంద్రిత అనేక ప్రతిపాదనలు ఇప్పటికీ అమలులోకి రాలేదన్నారు. రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేందుకు, ద్రవ్య లభ్యతను పెంచేందుకు మరియు మామిడి విలువ శ్రేణిని బలోపేతం చేసేందుకు చేసిన సూచనలు తగిన ప్రాధాన్యత పొందలేదన్నారు. ప్రస్తుతం అనేక ప్రాసెసింగ్ యూనిట్లు తోటపురి మామిడికి కిలోకు కేవలం 5 -7 రూపాయిలు మాత్రమే చెల్లిస్తున్నాయన్నారు. రైతులు ఖర్చులు తిరిగి పొందడానికి కనీసం 12 కిలో ధర అవసరమన్నారు. స్థిరమైన వ్యవసాయం తగిన ఆదాయం కోసం కిలోకు కనీసం 20 ధర రావాలని ఆవేదన వ్యక్తం చేసారు. అయితే ప్రస్తుత ధరలు రైతులను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ ఎస్. ఆనంద్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఎం. లవకుమార్ రెడ్డి, ట్రెజరర్ చంద్ర మౌళి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అప్రమత్తంగా ఉండాలి:

**-కంకణాల**



**తిరుపతి,జూన్ 11ప్రభాతవార్త:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా వ్యవహరించాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్‌నాయుడు పిలుపునిచ్చారు. గురువారం 11వ డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో బిఎల్‌ఓలకు, ఆర్‌పిలకు, కో క్లస్టర్‌ల 3 ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. సాధారణంగా ప్రతి ఎన్నికల సమయంలో కొత్త ఓట్లను చేర్చడం, మరణించిన లేదా అర్హత కోల్పోయిన వారి ఓట్లను తొలగించడం జరుగుతుందని, అయితే ప్రస్తుతం చేపడుతున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రక్రియ అని తెలిపారు. 24 ఏళ్ల తర్వాత 2026లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 2002కు ముందు నమోదైన ఓట్లను మినహాయించి, 2002 తర్వాత నమోదైన అన్ని ఓట్లను ఎన్నికల సంఘం క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. ఆ కాలంలో నమోదైన ఓటర్లు తమ వివరాలను ధ్రువీకరించుకొని, మ్యాపింగ్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. సంబంధిత అధికారులు ఇంటింటికీ వచ్చి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తారని, ఆ సమయంలో కుటుంబ సభ్యుల ఓట్లను నిర్ధారించి సర్వే పత్రాలపై సంతకాలు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నప్పటికీ కుటుంబ పెద్ద ధ్రువీకరణ తప్పనిసరి అని వివరించారు. బి.ఎల్.ఓలను ఎన్నికల సంఘం నియమిస్తే, బి.ఎల్.ఏలను ఆయా రాజకీయ పార్టీలు నియమిస్తాయని చెప్పారు. మ్యాపింగ్ ప్రక్రియ అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకవేళ నిర్లక్ష్యంగా మ్యాపింగ్ చేయించుకోకుండా వదిలేస్తే, జూలై 14 తర్వాత ఓటు హక్కును తిరిగి పొందేందుకు సంక్లిష్టమైన ప్రక్రియను అనుసరించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందుకోసం ఎన్నికల సంఘం గుర్తించిన 14 రకాల ధ్రువపత్రాల్లో ఒకదాన్ని సమర్పించి, నిర్ణీత సమయంలో మ్యాపింగ్ ఎందుకు జరగలేదో వివరణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

## శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన



**చంద్రగిరి, జూన్ 11 ప్రభాతవార్త:**

శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై నాగయ్య గారి పల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాలలో గురు వారం శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వారి ఆధ్వర్యంలో "ఖేత్ బచావో అభియాన్" కార్యక్ర మం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వ్యవసాయ కళాశాల అధికారులు సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, సేంద్రీయ వ్యవసాయం వంటి పద్ధతులను పాటించి సుస్థిరత సాధించవచ్చని అన్నారు. చీడపీడల నివారణకు విచక్షణారహితంగా పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించి పాటించవలసిన పద్ధతులను వివరించారు. పర్యావరణ సమతుల్యతను పాటిస్తూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని అధిక దిగుబడి సాధించుకోవాలన్నారు. మట్టి నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుని పండించే పంటల ఆధారంగా యాజమాన్య పద్ధతులను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల సేద్య విభాగాధిపతి డాక్టర్ ఎస్.హేమలత, మొక్కల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.కె.జ్యోష్ణ, కీటకశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.పాండురంగ, సాయిల్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీవిద్యశ్రీ, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జూన్ 25 నుంచి ప్రసన్న వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

**ముస్తాబవుతున్న అప్పలాయగుంట**

**వడమాలపేట, జూన్ 11 ప్రభాతవార్త:**

అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 25 నుంచి జూలై 3 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి వేణుగోపాల్ తెలిపారు. బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులందరికి ఆధ్యాత్మిక అనుభూతి కల్పించే విధంగా ఆలయంతో పాటు అప్పలాయగుంటను ముస్తాబు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి జేఈవో శరత్ అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల వైభవాన్ని భక్తులకు చేరవేసేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పరిసర గ్రామాల్లో ధర్మరథం ద్వారా ప్రచారం నిర్వహిస్తారు. జూన్ 25న ధ్వజారోహణం, 28న కల్యాణోత్సవం, 29న గరుడసేవ, జూలై 2న రథోత్సవం, 3న చక్రస్నానం జరుగుతుందన్నారు.

## సీఎం గారు.. హాస్టల్ ప్రారంభించేందుకు చర్యలు చూపండి

**250 మంది ఎస్సీ విద్యార్థులు హాస్టల్ సీట్లు కొరకు ఎదురు చూపు**



**కేవీబీ పురం, జూన్ 11 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కేవీబీ పురంలో గత 50 సంవత్సరాలుగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్ ప్రభుత్వ భవనంలో ఎస్సీ విద్యార్థులకు విద్యావృత్తికి హాస్టల్ నడుస్తుండేది. జిల్లాలో కేవీబీపురం మండలంలో తట్టు ప్రాంతం అలాంటి మండలానికి ఎస్సీ విద్యార్థులకు విద్యాపరంగా ఎంతో ఉపయోగంగా ఉండేది. ఆ హాస్టల్‌కు సుమారు 10 హైస్కూలు విద్యార్థులు అక్కడికి వస్తారు. ప్రస్తుతం అసలు విద్యార్థులే 250 మంది వేచి ఉన్నారు. విద్యార్థులు లేరని కుంటి సాకులు చెప్పి హాస్టళ్ళను గతంలో తొలగించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఈ మండలంలో వచ్చినప్పుడు హాస్టల్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారులకు జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర సాంఘిక సంక్షేమడైరెక్టర్‌కు కూడా వినతిపత్రం అందించారని తెలిపారు. విద్యార్థులు హాస్టల్ ప్రారంభిస్తారని ఎంతో ఆశగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ హాస్టల్ అద్దె భవనంలోనైనా ప్రారంభించండని విద్యార్థులు కోరుతున్నారు. ఎంపిటీసీలు, సర్పంచ్‌లు పలువురు మహిళా సంఘాలు ఎస్సీ నాయకులు బాలాజీ, సుబ్రహ్మణ్యం, గజేంద్ర, నాగభూషణమ్మ, గోవిందమ్మ, నాగ,మునిభాస్కర్, సుబ్రహ్మణ్యం, రాజులక్ష్మయ్య, గోవిందయ్య, సుధీర్, సుధీర్‌వర్మ, మన్యంరాజు, జడ్పీ పాఠశాల చైర్మన్‌లు తదితరులు కోరుతున్నారు.

## ఒక నెల ఒక గ్రామం కార్యక్రమంపై గ్రామసభ

**సత్యవేడు, జూన్ 11 ప్రభాతవార్త:**



రెవెన్యూ అధికారులు ఒక నెల ఒక గ్రామం కార్యక్రమం ద్వారా నాలుగు దఫాలుగా సందర్శించి భూ సమస్యలపై వినతులను స్వీకరిస్తున్నారు. ఇందులో భాగంగానే స్థానిక తహసీల్దార్ శివప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం దాసుకుప్పం సచివాలయ ప్రాంగణంలో వీఆర్‌వో సుకుమార్ ఆధ్వర్యంలో ఒక నెల ఒక గ్రామం కార్యక్రమంలో భాగంగా గ్రామసభను నిర్వహించారు. ప్రజల నుంచి భూ సంబంధిత సమస్యలపై పలు వినతులు స్వీకరించారు. దాసుకుప్పం రెవెన్యూలో సర్వే నెం.32/3లో 0-09 సెంట్లు భూమి బాగా పరిష్కారంలో నాలుగున్నర సెంట్లు తన తల్లి పేరుపై ఉందని, అయితే 32/3 ఏ నాలుగున్నర సెంట్లు తన తల్లి పేరుతో ఉన్న భూమి ప్రస్తుతం నేషనల్ ఖాతాలో ఉన్నందు వల్ల తన పేరుపై నమోదు చేసుకోలేకపోతున్నట్లు రైతు లోకయ్యరెడ్డి వినతి అందించారు. నోషనల్ ఖాతా నుంచి నమోదు చేయాలని విన్నవించారు. అలాగే సర్వే నెం.130 పీడబ్ల్యు ప్రభుత్వ భూమి కొందరు ఆక్రమించుకుని మద్యం దుకాణాన్ని బార్లను నడిపిస్తున్నట్లు గ్రామస్తుడు జగన్నాథం రెడ్డి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పైగా సుప్రీం కోర్టు గైడెన్స్ ప్రకారం హైవేకు 250 అడుగుల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలని సూచిస్తున్న అమలుకు నోచుకోవడం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని వినతి అందించారు. భూ యజమానులకు రికార్డు సరిదిద్దడం, భూమి రకం, హక్కుల వంటి వాటిపై స్పష్టత తీసుకురావడమే ఒక నెల ఒక గ్రామం కార్యక్రమం ఉద్దేశమని ఈ సందర్భంగా వీఆర్‌వో సుకుమార్ వివరించారు. ఇప్పటికే రెవెన్యూ పరిధిలో దాదాపు 1200 ఎకరాలు రీ సర్వే చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సురేష్, మహిళా పోలీసు లక్ష్మి, ఏఎన్ఎం సుమలత, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరి, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

## 50 శాతం రాయితీతో జనుములు పంపిణీ

**విజయపురం, జూన్ 11 ప్రభాతవార్త:**

మండలంలోని రైతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో జనుములు అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రజని కుమారి తెలిపారు. గురువారం విజయపురం రైతుసేవా కేంద్రం వద్ద ఎంపీపీ లక్ష్మీపతి రాజు చేతుల మీదుగా అవసరమైన రైతులకు రాయితీ జనుములు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబు యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యంరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

